క్లుప్తంగా

కనీస మద్దతు ధర ప్రకటించాలి



తెనాలిఅర్బన్: పసుపు, జొన్న, మొక్కజొన్న పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించి మార్కెట్ యార్డు ద్వారా వాటిని కొనుగోలు చేయించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం నాయకులు ములకా శివసాంబిరెడ్డి కోరారు. తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే ది తెనాలి పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం నాయకులు ట్రాఫిక్ అడ్వయిజరీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు వినతిపత్రం అందజేశారు. మొత్తం 13 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని అతిత్వరలో పరిష్కరించుకున్న గీతాంజలి శర్మ ప్రకటించారు. కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతు భరోసా గ్రీవెన్స్‌ను ఉపయోగించుకోండి

కొల్లిపర: 2023–24 లో వైఎస్‌ఆర్ రైతుభరోసా గ్రీవెన్స్ మాడ్యూల్ ఈనెల 30వ తేదీన ముగుస్తుందని, అందుకు రైతులు రైతుభరోసా పథకంలో సమస్యలు ఉంటే వెంటనే సమస్యలతో కూడిన అర్జీలను గ్రీవెన్స్‌లో అందించి ఈనెల లోపుల పరిష్కరించుకోవాలని తెనాలి ఏడీఏ కె.వెంకటరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో ఆరు రకాల సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. 1.చనిపోయిన రైతుల నామినీలు (భర్త లేదా భార్య మాత్రమే) 2.కొత్తగా కొనుగోలు చేసిన పొలాలు 3.గత సంవత్సరం ఆదాయ పన్ను కట్టని రైతులు 4.వెబ్ లాండ్‌లో భూమి ఉన్న భూమి లేదు అని ఉన్న రైతులు 5.గతంలో జీఎస్‌టీ ఉండి ఇప్పుడు రద్దు చేసుకున్న రైతులు, 6.గతంలో ఉమ్మడి కుటుంబంలో ఉండి ఇప్పుడు వేరు పడిన రైతులు ఈ సమస్యల కారణంగా రైతుభరోసా రాని రైతులు ఇప్పుడు వెంటనే సంబంధిత ధ్రువ పత్రాలు తీసుకుని ఆర్బీకే కేంద్రాలల్లో సిబ్బందికి అందజేయాలని తెలిపారు.ఈ అవకాశం రైతుభరోసాకు అర్హత ఉంది రాని ప్రతి రైతు ఉపయోగించుకోవాలని కోరారు.

రేపు ఉచిత యోగ శిక్షణ

తెనాలిటౌన్: గంగానమ్మ పేటలోని చుండూరు వారి సత్రంలో శ్రీ ఆంజనేయం ధ్యాన యోగ మండలి ఆధ్వర్యంలో బుధవారం నుంచి ఉచిత యోగ శిక్షణ నిర్వహిస్తున్నట్లు యోగ మండలి కన్వీనర్ కూరపాటి నాగరాజు సోమవారం తెలిపారు. యోగ మండలి వ్యవస్థాపకులు కిషోర్ గురూజీ పర్యవేక్షణలో ప్రతిరోజు ఉదయం ఐదు గంటల నుంచి ఏడు గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఎనిమిది సంవత్సరాల నుంచి 80 సంవత్సరాల వయస్సు కలిగి నడవ కలిగిన ప్రతి ఒక్కరూ శిక్షణలో పాల్గొనవచ్చని తెలిపారు. వివరాకు 9440712208లో సంప్రదించాలనికోరారు.

ఆర్బీకేలో రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

కొల్లిపర: భూసారం పెరగటానికి రైతులకు ప్రభుత్వం 50 శాతం రాయితీపై జనుము, పిల్లి పెసర అందజేస్తున్నట్లు తెనాలి ఏడీఏ కె.వెంకటరావు అన్నారు.సోమవారం ఆయన స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రైతులతో మాట్లాడుతూ జనుము కేజీ ధర రూ.84 ఉండగా రాయితీపై రూ.42కి ఇవ్వనున్నట్లు, పిల్లి పెసర కేజీ రూ.97 ఉండగా రాయితీపై రూ.48.50కి ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులు ఆయా గ్రామంలోని ఆర్బీకే కేంద్రాలకు పట్టాదారు పాస్ పుస్తకం,ఆధార్ కార్డు తీసుకొని కేంద్రంలో సిబ్బందిని కలసి పచ్చి రొట్ట విత్తనాలు తీసుకోవాలని కోరారు.

కుమార్తె సహా తల్లి అదృశ్యం

తెనాలిరూరల్: కుమార్తె సహా తల్లి అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ మోరిస్ పేట ఆర్‌ఆర్‌నగర్‌కు చెందిన బొర్రా మాధవి తన మూడేళ్ల కుమార్తెతో కలసి ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో భర్త శ్రీనివాసరావు త్రీ టౌన్ పోలీసులను సోమవారం రాత్రి ఆశ్రయించగా ఎస్‌ఐ ఎం. విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భట్టిప్రోలు పంచాయతీ కార్యదర్శిగా శ్రీనివాసరావు

భట్టిప్రోలు: భట్టిప్రోలు గ్రామ పంచాయతీకి పూర్తిస్థాయి కార్యదర్శిగా కోట శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన దుగ్గిరాల మండలం చిలువూరు పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీ సీహెచ్ శేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. భట్టిప్రోలు గ్రామ పంచాయతీకి ఏడాదిగా పూర్తిస్థాయి కార్యదర్శి లేకపోవడంతో ఇన్‌చార్జ్‌ల పాలన కొనసాగుతూ వచ్చింది.

4న కట్లమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం

వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరు గ్రామ దేవత కట్లమ్మ తల్లి ఆలయ 25వ వార్షిక మహోత్సవం మే 4, 5 తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు దేవస్థాన అభివృద్ధి కమిటీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. 4న అమ్మవారికి చద్ది నైవేద్యాలు, సాయంత్రం లక్ష మల్లెల పూజ, 5న నిత్య పూజ, పావన నదీ స్నానం, సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మద్దతు అపూర్వం!

- జగనన్నే మా భవిష్యత్ పీపుల్స్ సర్వేకు అపూర్వ మద్దతు
- నియోజకవర్గంలో ఇప్పటికి 63 వేల 196 కుటుంబాల మద్దతు
- జిల్లాలోనే తెనాలిని అగ్రగామిగా నిలిపిన ప్రజలు
- అభూత కల్పనలు ప్రచారం చేస్తున్న ప్రతిపక్షాలకు చెంపపెట్టు
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 7వ తేదీ నుంచి ఆరంభమైన 'జగనన్నే మా భవిష్యత్'లో తెనాలి నియోజకవర్గంలోని 1,04,262 కుటుంబాలకుగాను ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రభుత్వ పనితీరుకు 63,196 కుటుంబాలు మద్దతు తెలియజేశాయని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. పీపుల్స్ సర్వేలో తెనాలిని జిల్లాలోనే అగ్రగామిగా నిలిపారని చెబుతూ మరో 41 వేల కుటుంబాలను గడువులోగా చేరుకుంటామని వెల్లడించారు. స్థానిక గంగానమ్మ పేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం పార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించాలనేది ప్రభుత్వ నిర్ణయమన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక 98 శాతంపైగా నెరవేర్చినట్టు గుర్తు చేశారు. పేదరికమే అర్హతగా, రాజకీయ పార్టీలతో పనిలేకుండా, అవినీతి లేకుండా నేరుగా సంక్షేమ పథకాలను ప్రజల ఖాతాల్లో జమ చేస్తున్నట్టు గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికి రూ.2.07 లక్షల కోట్లను సంక్షేమం ద్వారా ప్రజలకు అందించినట్టు తెలిపారు. అదే గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో పింఛను మంజూరుకు కొంత, ఇచ్చిన పింఛనులో మరికొంత దోచుకునే వారన్నారు. ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమంతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారా? సమస్యలు ఏవైనా ఉన్నాయా? వంటి అంశాలను నేరుగా తెలుసుకోవాలనే భావనతోనే జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్దేశించుకున్నట్టు ఎమ్మెల్యే శివకుమార్ తెలిపారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి పార్టీ వర్గాలు ప్రతి ఇంటిని సందర్శించే కార్యక్రమాన్ని ఈనెల ఏడు నుంచి ఆరంభించినట్టు గుర్తుచేశారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 1,07,51,562 మంది జగనన్న ప్రభుత్వానికి మద్దతు తెలియజేయగా, నియోజకవర్గంలో 63,196 మంది మద్దతు నిచ్చినట్టు చెప్పారు. ఇంటి యజమాని అనుమతితోనే ఆ ఇంటి గోడపై మా నమ్మకం నువ్వే జగన్ అనే స్టిక్కరును అంటిస్తున్నట్టు తెలిపారు. తమను ప్రజలు స్వాగతిస్తున్నారని, గడపగడపకు వార్డుల పర్యటనలో కొంతమంది తమ ఇంటికి స్టిక్కరు వేయలేదని అడుగుతున్నారని చెప్పారు. అభూత కల్పనలు ప్రచారం చేస్తున్న ప్రతిపక్షాలకు ఇది పెద్ద చెంప పెట్టుగా వ్యాఖ్యానించారు. పీపుల్స్ సర్వేలో తెనాలి నియోజకవర్గం జిల్లాలోనే అగ్రగామిగా నిలిపేందుకు కారకులైన ప్రజలకు, విజయవంతం చేసిన ప్రజలకు, కన్వీనర్లు, గృహసారధులు, సమన్వయకర్తలుగా పనిచేసిన మన్నవ ప్రభాకర్, తాడిబోయిన రామయ్య, ఫరీద్, శేఖర్‌రెడ్డికి ఎమ్మెల్యే శివకుమార్ ధన్యవాదాలు తెలియజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు, కౌన్సిలరు తాడిబోయిన రామయ్య మాట్లాడారు. పార్టీ నేతలు మన్నవ ప్రభాకర్, కావేటి నిర్మల, ప్రసాదం బాలగురవమ్మ, వీర్లపాటి విజయలక్ష్మి, తోట రఘురామ్, గొడవర్తి హరేరామ్, అత్తోట నాగవేణి, మల్లెబోయిన రాము, పెచ్చింగ్ సుభాని, అనిల్‌కుమార్, కాళిదాసు సత్యం, రాళ్లబండి కిశోర్, కొడలి క్రాంతి, విష్ణువర్ధన్ రెడ్డి, శేఖరరెడ్డి, చుండూరు సాయి, బూరెల దుర్గాప్రసాద్, చింకా సురేష్, వంపుగళ్ల కృష్ణ, గొరికపూడి బాలరాజు, కాకి దేవసహాయం, దేవరపల్లి కిశో, కఠారి హరీష్, పెసర్లంక రమణ, మేకల రవి, అత్తోట శ్యామ్, టెక్స్ బాల, గుర్రం హేమలత, ఫరీద్ పాల్గొన్నారు.

పాదచారులకు మజ్జిగ పంపిణీ



తెనాలిటౌన్:బోసురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద అన్నదాత సుఖీభవ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం సభ్యులు వేపూరి గోపాలరావు, అనూష దంపతులు పుట్టిన రోజు సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించారు. చలివేంద్రంలో చల్లటి మజ్జిగను పాదచారులకు అందజేశారు. ఎస్వీయోగ కన్వీనర్ ఎం.రమణయ్య, అన్నదాత సుఖీభవ సభ్యులు పాల్గొన్నారు.

లారీకి జరిమానా

తెనాలిరూరల్: ఓవర్ లోడుతో వెళుతున్న లారీకి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు జరిమానా విధించారు. నియోజకవర్గంలోని కొల్లిపర వద్ద ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ. చలం, సిబ్బంది సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక ఇసుక లోడుతో వెళుతున్న లారీని గుర్తించి రూ.ఐదు వేలు జరిమానా విధించారు.

సాంస్కృతిక వైభవానికి తెనాలి ప్రతీక

గుర్రం జాషువా కళాపరిషత్ వార్షికోత్సవ సభలో ఎమ్మెల్యే శివకుమార్



గజల్ శ్రీనివాస్‌కు మహాకవి జాషువా విశిష్ట పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: కళల కాణాచి తెనాలి సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. దుగ్గిరాలకు చెందిన పద్మభూషణ్ గుర్రం జాషువా స్మారక కళాపరిషత్ 35వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం రాత్రి ఇక్కడి ఎన్జీవో కల్యాణ మండపంలో జాతీయస్థాయి కవుల కవి సమ్మేళనం నిర్వహించారు. సాహితీ ప్రముఖులకు జాషువా పురస్కారాలను ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే శివకుమార్ వార్షికోత్సవ సంచికను ఆవిష్కరించారు. ప్రఖ్యాత గజల్ కళాకారుడు, ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు మ్యాస్ట్రో గజల్ శ్రీనివాస్‌ను మహాకవి జాషువా విశిష్ట పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు. పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు పెద్దిటి యోహాను సమన్వయకర్తగా జరిగిన సభలో ఎమ్మెల్యే శివకుమార్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, ఆంధ్రాప్యారిస్ తెనాలిలో నిరంతరం సాహితీ, సాంస్కృతిక కార్యక్రమాలు జరగాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సాహితీవేత్తలు, కళాకారులను ఆహ్వానించాలని సూచించారు. నేటితరానికి ఆ కార్యక్రమాలు స్ఫూర్తి కాగలవన్నారు. 126 దేశాల్లో గజల్ గానం చేసిన అంతర్జాతీయ గజల్ గాయకుడు గజల్ శ్రీనివాస్ గజల్ కచేరీని త్వరలో తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ, డిజిటల్ యుగంలో గ్రంథాలయానికి వెళ్లి పుస్తకాలు చదివే చదువరులు తగ్గిపోయారని చెప్పారు. జ్ఞానవంతమైన జీవితానికి చదువు అవసరమని చెబుతూ అందుకోసమే గ్రంథాలయాలకు చదువరులు వచ్చేలా కొత్త పుస్తకాలను తీసుకుంటున్నామని తెలిపారు. గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు భాష అనేది బడి భాష కాదని, అమ్మ ఒడి భాషగా చెప్పారు. ఇంట్లో మాట్లాడటం నేర్చుకుంటేనే భాష బతుకుతుందన్నారు. జాషువా కవిత్వాన్ని ఇంకా బతికిస్తున్న శిష్యుల గొప్పదనం ఎంతో ఉందని నిర్వాహకులను అభినందించారు.

తొలుత పెద్దిటి యోహాను, రంగిశెట్టి రమేష్, అయినాల మల్లేశ్వరరావు, చందు సూర్య, వినుకొండ శ్రీరామమూర్తి పర్యవేక్షణలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈఎల్‌వీ అప్పారావు, వివిధ కళా, సాంస్కృతిక సంస్థల నిర్వాహకులు ఆదిత్య కృష్ణంరాజు, లక్కరాజు సాయి, జె.న్యూటన్ మాట్లాడారు. అనంతరం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి టి.రామచంద్రుడు ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన కవులను జాషువా పురస్కారాలతో సత్కరించారు. సభానంతరం గజల్ శ్రీనివాస్ తన గజల్ గానంతో ప్రేక్షకులను అలరించారు.

గ్రామాభివృద్ధికి కృషి చేయాలి



మండల స్థాయి అవార్డు అందుకుంటున్న సర్పంచులు

కొల్లిపర: ప్రజా ప్రతినిధులు, అధికారులు గ్రామాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అభివృద్ధి సాధించిన పంచాయతీ సర్పంచ్‌లకు ప్రభుత్వం అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పంచాయతీలలో ఉత్తమ పురస్కారాలు అందుకున్న పంచాయతీ సర్పంచులను ఎంపీడీవో పి.శ్రీనివాసులు అధ్యక్షతన ఎంపీపీ పద్మావతి, తహసీల్దారు నాంచారయ్య వారిని సత్కరించి, అవార్డులను అందజేశారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం ప్రామాణికంగా 9 అంశాలతో ఉత్తమ పనితీరు కనపర్చిన గ్రామాలను ఎంపిక చేసి ఆగ్రామాల సర్పంచ్‌లకు అవార్డులు ఇవ్వటం జరిగిందని ఎంపీడీవో పి.శ్రీనివాసులు తెలిపారు. మండలంలో కుంచవరం, అత్తోట, బొమ్మువానిపాలెం గ్రామాల సర్పంచులను జిల్లాస్థాయిలో ఎంపికై జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నట్లు, మిగిలిన కొన్ని గ్రామ సర్పంచులకు మండల స్థాయి అవార్డులు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ప్రతి గ్రామ పంచాయతీలు ఉత్తమ అవార్డులు పొందేవిధంగా కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో భీమవరపు సంజీవరెడ్డి, అవుతు పోతిరెడ్డి, బొమ్ము శ్రీనివాస రెడ్డి, పరిపాలనాధికారి చంద్రమోహన్, సీనియర్ అసిస్టెంటు భీమవరపు మధుసూదనరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

తెనాలిటౌన్: పంచాయతీరాజ్ వ్యవస్థ ద్వారా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని, ఈ వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు తెలిపారు. కొత్తపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జాతీయ పంచాయత్ రాజ్ దినోత్సవాలను జరిపారు. సమావేశానికి ఎంపీడీవో ఎస్.విజయా లక్ష్మణ్ అధ్యక్షత వహించారు. ఎంపీపీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. మండలస్థాయిలో వివిధ కేటగిరిల్లో ఎంపికైన పంచాయతీలకు ప్రశంసాపత్రంను అందజేశారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ప్రభాకర్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తెనాలిలో చలివేంద్రాలు ఆరంభించిన దాతలు



ఇస్లాంపేటలో మజ్జిగను పంపిణీ చేస్తున్న న్యాయవాది శ్రీనివాసరావు



శివాజీచౌక్‌లో మినరల్ వాటర్‌ను పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ వెంకటేశ్వరరావు

తెనాలిఅర్బన్: కాళీమాత దేవస్థాన కమిటీ చైర్మన్, మాజీ కౌన్సిలర్ గుమ్మడి రమేష్ ఆధ్వర్యంలో శివాజీచౌక్‌లో సోమవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కౌన్సిలర్ అడుసుమల్లి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం మినరల్ వాటర్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యర్రు శ్రీనివాస్, దేవినేని పాములు, కందేపి సీతారామయ్య, నక్కా వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

+ తెనాలి పట్టణ నూతన కృష్ణబలిజ సంఘం ఆధ్వర్యంలో ఇస్లాంపేటలో సోమవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రముఖ న్యాయవాది తాడిబోయిన శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కావేటి వేణుగోపాల్, కార్యదర్శి నరసింహారావు, నాయకులు రామమూర్తి, హరిబాబు, శ్రీరాములు, వేణు,రవి, నాంచారయ్య, తదితరులుపాల్గొన్నారు.

నందివెలుగులో రైతు సదస్సు



తెనాలిటౌన్: రూరల్ మండలం నందివెలుగు గ్రామంలో బాపట్ల వ్యవసాయ కళాశాలలో నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థినీలు ఆధ్వర్యంలో సోమవారం రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. రూరల్ వర్క్స్ ఎక్స్‌పీరియన్స్ ప్రోగ్రామ్ కార్యక్రమంలో భాగంగా కళాశాలక చెందిన విద్యార్థినీలు సాయిపూజ, సాహితి విజ్ఞ, రోహిణి, షఫియా, రోషిణి, రవళి, పూర్ణిమలు మూడు నెలల నుంచి గ్రామంలో ఉంటూ రైతులు పండించే పంటలు, సాగు పద్ధతులు, ఖర్చుల వివరాలు తెలుసుకోవడం జరిగిందని కళాశాల ప్రొఫెసర్ శివనారాయణ తెలిపారు. ముఖ్యఅతిథులుగా మార్కాపూర్ కాలేజ్ ఏడీ వీఎస్‌కె రెడ్డి, లాఫారం శాస్త్రవేత్త శ్రీలతవాణి, సర్పంచ్ దూళిపాళ్ళ పవన్‌కుమార్, సొసైటీ చైర్‌పర్సన్ తోటకూర వసంతరావులు పాల్గొన్నారు. సదస్సులో సర్పంచ్ పవన్‌కుమార్ మాట్లాడుతూ మూడు నెలలపాటు విద్యార్థులు గ్రామంలో ఉండి రైతులకు వ్యవసాయం సాగుపై అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. రైతులు సాగు చేసే పంటలు, మార్కెటింగ్ దిగుబడులు, తదితర అంశాలపై శాస్త్రవేత్తలు వివరించారు. రైతులు, ఆర్బీకెల సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.

పలువురు విద్యార్థులకు ఎన్‌సీసీ అవార్డులు



అవార్డులు పొందిన వారితో కల్నల్ చంద్రశేఖర్

తెనాలిఅర్బన్: ఎన్‌సీసీ అవార్డులకు తెనాలిలోని రావి సాంబయ్య మున్సిపల్ బాయ్స్ హైస్కూల్ విద్యార్థులు ఐదుగురు ఎంపికైనట్లు హెచ్‌ఎం షేక్ మౌలాబీ తెలిపారు. వీటిని న్యూఢిల్లీకి చెందిన డీజీఎన్‌సీసీ విభాగం వారు ప్రకటించినట్లు చెప్పారు. జూనియర్ విభాగంలో పలపర్తి లక్ష్మీ పద్మావతి బెస్ట్ క్యాడెట్ అవార్డుకు ఎంపికైందన్నారు. వరుసగా మూడు సంవత్సరాల నుంచి తమ పాఠశాలకు ఈ అవార్డు వస్తుందని, ఈ ఏడాదితో హ్యాట్రిక్ సాధించినట్లు అయిందని వివరించారు. అవార్డుతో పాటు రూ.3,500 నగదు ప్రోత్సాహక బహుమతిని లక్ష్మీ పద్మావతికి అందించినట్లు చెప్పారు. అలాగే ఎం.యోచన, పి.లక్ష్మీపద్మావతి,పి.ధర్మతేజ, ఆర్.చింటు నాయక్‌లు సిడబ్ల్యువోఎస్ స్కాలర్ షిప్ ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఒక్కొక్కరికీ రూ.ఆరువేల నగదును దీని ద్వారా అందించనున్నట్లు చెప్పారు. వీరందరికీ కల్నల్ ఎస్ఎస్.చంద్రశేఖర్ అవార్డులు అందజేసి నగదును పంపిణీ చేశారు. తెనాలిలో సోమవారం జరిగిన కార్యక్రమంలో అవార్డులకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ఉద్యోగి జీవితంలో బదిలీలు సాధారణం

11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి. మాలతి



బదిలీ అయిన న్యాయమూర్తులను సత్కరించిన న్యాయమూర్తులు మాలతి, శ్రీసీత

తెనాలిరూరల్: ఉద్యోగి జీవితంలో బదిలీలు సాధారణమని, ఎక్కడ పని చేసినా బాధితులకు న్యాయం జరిగేలా విధులు నిర్వహించడమే న్యాయమూర్తులు ప్రధాన కర్తవ్యమని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి. మాలతి అన్నారు. తెనాలి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి టి. రామచంద్రుడు, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె. వాణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ అబ్దుల్ షరీఫ్, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో తెనాలి అడ్వకేట్ క్లర్క్స్ అసోసియేషన్ సభ్యులు బదిలీ అయిన న్యాయమూర్తులను సోమవారం సత్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి. మాలతి మాట్లాడుతూ న్యాయం కోసం కోర్టులను ఆశ్రయించే వారికి పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా చూడాలన్నారు.

కార్యక్రమంలో రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె. శ్రీసీత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వేణుగోపాలరావు, ప్రభుదాసు, రాజు, సాగర్, డూండి, నాగేశ్వరరావు, చంద్రశేఖర్, నరసింహారావు, శ్రీనివాసరావు, జాను తదితర న్యాయవాద గుమాస్తాలు పాల్గొన్నారు.

జేఎంజే కళాశాల వజ్రోత్సవ వేడుకలు



దివ్య బలిపూజలో పాల్గొన్న ఫాదర్‌లు

తెనాలిఅర్బన్: జేఎంజే కళాశాల వజ్రోత్సవ వేడుకలను సోమవారం కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఆర్‌సీఎం చర్చి ఫాదర్‌లు కళాశాలలో దివ్యబలిపూజను నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఫాదర్ విజయానంద్ మాట్లాడుతూ స్త్రీ విద్య ద్వారా కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశంతో జేఎంజే కళాశాలను 1963లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అనేక మంది విద్యార్థినులకు విద్యను అందించి వారికి అభ్యున్నతికి కళాశాల పాటుపడిందన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సిస్టర్ థెరిస్సామ్మ, ప్రిన్సిపల్ సిస్టర్ షైనీ, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ శారద, పలువురు అధ్యాపకులు, విద్యార్థినులు, ఆర్‌సీఎం చర్చి ఫాదర్‌లు పాల్గొన్నారు.

వాణిజ్య పంటలకు తప్పిన ముప్పు



కఠెవరంలో గాలులకు నేలకొరిగిన మొక్కజొన్న పంట



ఎరుకలపూడిలో మొక్కజొన్న కండెలను ఆరబెట్టిన రైతులు

తెనాలిటౌన్: వాతావరణంలో ఏర్పడ్డ ద్రోణి ప్రభావంతో ఆదివారం రాత్రి ఈదురుగాలులు వీచడం, స్వల్ప వర్షం కురవడంతో అక్కడక్కడ మొక్కజొన్న, జొన్న పంటలకు నేలకొరిగాయి. నేలకొరిగిన మొక్కజొన్నలో రైతులు కూలీలతో సోమవారం కండెలుకోయించారు. ట్రాక్టర్‌లతో కండెలను పోగు చేయించి ఒకచోట గుట్టగా ఆరబెట్టారు. తేలికపాటి జల్లుల వర్షం కురవడంతో పంటకు పెద్దగా నష్టం జరుగలేదు. వాణిజ్య పంటలైన జొన్న, మొక్కజొన్న, మినుము పంటలకు ముప్పు తప్పింది. రైతులు ఊపిరి పీల్చుకున్నారు. జల్లులతో వర్షం కురవడంతో వాతావరణం సోమవారం చల్లబడింది. తెనాలి మండలంలో మొక్కజొన్న 7126 ఎకరాలు, జొన్న 5790 ఎకరాల్లో సాగు చేసినట్లు మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ తెలిపారు. 50శాతం మేర పంటలను కోచినట్లు తెలిపారు. గాలులు ఎకువై వర్షం కురిచినట్లయితే పంటలు దెబ్బ తిని రైతులు నష్టపోయేవారని పలువురు రైతులు తెలిపారు. వరుణుడు కరుణించినట్లు చెప్పారు.

నాటక కళాకారుడికి సన్మానం



కిషోర్‌కుమార్‌ను సన్మానిస్తున్న వెంకటేశ్వరరావు, ఆంజనేయులు తదితరులు

తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో సోమవారం సవతికొడుకు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. మంగళవారం ఎర్రకోటవీరుడు చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం పౌరాణిక నాటక కళాకారుడు మండల కిషోర్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, చాట్రగడ్డ ఆంజనేయులు, చిలకా ప్రసాద్, తరణిహేమంత్ కుమార్, రెడ్డి ఉమామహేశ్వరరావు, పెమ్మసానీ పోతురాజు,డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఈదర శ్రీనివాసరావు, దేవరపల్లి భవానీ, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, సోమవరపు సాంబశివరావు, ఈదర శ్రీనివాసరావు, గుమ్మడి ప్రసాద్, దాసరి నరసయ్య, ముళ్ళపూడి వెంకట్, నల్లూరి శ్రీనివాస్, సుబ్బారావు పాల్గొన్నారు.